గుండెపోటుతో ఆసుపత్రి సూపరింటెండెంట్ మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గంటా ప్రభాకర్ (61) విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆయనకు ఆసుపత్రిలో గుండెపోటు రాగా హుటాహుటీన పాలకొల్లు ఆసుపత్రి డాక్టర్లు వైద్య సేవలందించారు. వెంటనే మెరుగైన వైద్యం నిమిత్తం ఆయనను స్థానిక న్యూలైఫ్ హాస్పటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించి సాయంత్రం 4.30 గంటల సమయంలో ప్రభాకర్ మృతి చెందారు. చిన్న పిల్లల వైద్యులుగా ఆయన ఎందరో పిల్లలకు వైద్యసేవలందించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతి పట్ల వైద్యులు వర్మ, సంతోష్, డాక్టర్ బూన్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చెన్ను విజయ్, చినమిల్లి గణపతి, సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ప్రభాకర్ (ఫైల్‌ఫోటో)

గెలుపు కేరింత.. ఓటమి నిట్టూర్పు..!

జోష్‌లో రెండు జిల్లాల్లోని కూటమి శ్రేణులు
నిర్వేదంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు
పోలవరం మినహా అన్ని నియోజకవర్గాల్లో కూటమికి 50 శాతానికిపైగా ఓట్లు
పోస్టల్ బ్యాలెట్‌లోనూ అదే ఒరవడి
అనూహ్య మెజార్టీలపై టిడిపి కూటమి అభ్యర్థుల్లో విస్మయం
ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం, అధిక భారాలపైనే ప్రజల తీర్పు
పందేల్లో భారీగా నష్టపోయిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల ఘట్టం ముగిసింది. మంగళవారం వెలువడిన ఫలితాలతో రెండు జిల్లాల్లోనూ టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులంతా కేరింతలు, ఆనందోత్సాహాల్లో మునిగి తేలుతుండగా, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మాత్రం నిర్వేదంలో మునిగిపోయారు. రెండు జిల్లాల్లోనూ ఒక ఎంఎల్‌ఎగాని, ఎంపీగానీ గెలవకపోవడం ఆ పార్టీ శ్రేణులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. గెలుపుతోపాటు కూటమి అభ్యర్థులకు వచ్చిన ఓట్ల మెజార్టీ వైసిపి నాయకులను, కార్యకర్తలను నివ్వెరపోయేలా చేస్తోంది. గత ఎన్నికల్లో 30 వేలకుపైగా మెజార్టీతో గెలిచిన వైసిపి ఎంఎల్‌ఎలు ఈసారి 40 వేలు, 50 వేలు అంతకుపైగా ఓట్ల తేడాతో ఓటమి పాలవడాన్ని నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో వైసిపి నాయకులు బుధవారం దాదాపు ఇళ్లకే పరిమితమయ్యారు. బయటికి వచ్చిన పని చూసుకుని ఇంటికి తిరిగి వెళ్లిపోయిన పరిస్థితి కన్పించింది. ఏలూరు జిల్లాలో పోలైన ఓట్లలో ఏలూరు నియోజకవర్గంలో 67 శాతం టిడిపి అభ్యర్థి బడేటి చంటికి రావడం, వైసిపి అభ్యర్థికి 29.57 శాతం ఓట్లు మాత్రమే రావడం అందరినీ నివ్వెరపర్చింది. దెందులూరులో టిడిపి అభ్యర్థికి 55.11 శాతం, చింతలపూడిలో 53.3 శాతం, నూజివీడులో 51.12 శాతం, ఉంగుటూరులో 59.63 శాతం, కైకలూరులో 60.38 శాతం ఓట్లు కూటమి అభ్యర్థులకు వచ్చాయంటే ఎన్నికల్లో ప్రజలు ఎంత ఏకపక్షంగా ఓట్లు వేశారో అర్థం చేసుకోవచ్చు. ఏలూరు జిల్లాలో ఒక్క పోలవరంలోనే 50 శాతంలోపు 46.33 శాతం ఓట్లతో జనసేన అభ్యర్థి గెలిచారు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ అదే పరిస్థితి కొనసాగింది. తణుకులో టిడిపి అభ్యర్థికి 66.51 శాతం ఓట్లు లభించాయి. పాలకొల్లు, ఆచంట, తాడేపల్లిగూడెం, ఉండి తదితర అన్ని నియోజకవర్గాల్లోనూ 50 శాతానిపైగా ఓట్లు కూటమి అభ్యర్థులకు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలోనూ అదే ఒరవడి కనిపించింది. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 2,193 పోస్టల్ బ్యాలెట్లకుగాను జనసేన అభ్యర్థికి ఏకంగా 1488 ఓట్లు రాగా వైసిపి అభ్యర్థికి కేవలం 506 ఓట్లు మాత్రమే వచ్చాయి. ప్రతి నియోజకవర్గంలోనూ 60 శాతానికిపైగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కూటమికి దక్కాయి. ఈ కారణంగానే కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీలను సొంతం చేసుకున్న పరిస్థితి ఉంది. ఎంపీ స్థానాల్లోనూ నరసాపురం కూటమి అభ్యర్థికి 57.41 శాతం ఓట్లు రాగా వైసిపి అభ్యర్థికి 34.94 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. ఏలూరులో కూటమి ఎంపీ అభ్యర్థికి 54 శాతం ఓట్లురాగా వైసిపి అభ్యర్థికి 40.84 శాతం ఓట్లు లభించాయి. ఇంత దారుణ ఓటమికి కారణాలు ఏమిటనే దానిపై రెండు జిల్లాల్లోనూ చర్చోపచర్చలు సాగుతున్నాయి.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం.. అధిక భారాలపైనే ప్రజల తీర్పు

వైసిపి ఓటమికి ప్రధాన కారణం ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం, అధిక భారాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. గత ఎన్నికల్లో జిల్లాకు ఇచ్చిన ఏఒక్క హామీని వైసిపి ప్రభుత్వం నెరవేర్చలేదు. తాగునీరు అందించడం, పోలవరం నిర్వాసితుల సమస్యలు, చింతలపూడి రైతులకు పరిహారం, డెల్టా ఆధునికీకరణ, రోడ్లు వేయకపోవడం, కొల్లేరు సమస్యను పట్టించుకోకపోవడం, వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పకపోవడం, ధాన్యం అమ్ముకునేందుకు రైతులు మిల్లర్లకు ఎదురు సొమ్ము ఇవ్వడం వంటి అనేక సమస్యలను వైసిపి పట్టించుకోలేదు. చెత్త, ఆస్తిపన్ను, విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీల పెంపు వంటి అంశాలు వైసిపిని దెబ్బతీశాయి. సంక్షేమ పథకాలు ఇస్తున్నాం కాబట్టి ఏం చేయకపోయినా ప్రజలు పట్టించుకోరు అనే ధోరణిలో వైసిపి ప్రభుత్వం వ్యవహరించిందనే విమర్శలు విన్పిస్తున్నాయి. స్థానిక వైసిపి నాయకత్వం గ్రామాల్లో వ్యవహరించిన తీరు ప్రజల్లో తీవ్ర కోపాన్ని రగలించింది. రెండు జిల్లాల్లో వైసిపికి ఒక్క సీటూ రాకపోవడానికి ప్రజలు పడుతున్న ఇబ్బందులే కారణమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. కొత్త ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకుని ముందుకు సాగుతుందో.. లేదో వేచిచూడాలి.

పందేల్లో భారీగా నష్టపోయిన వైసిపి శ్రేణులు

ఈ ఎన్నికల్లో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పందేల్లో భారీగా నష్టపోయారు. ప్రతి నియోజకవర్గంలోనూ రూ.కోట్లలో భారీగా పందేలు కాశారు. ఎగ్జిట్‌పోల్స్ వచ్చిన తర్వాత మరిన్ని పందేలు సాగాయి. సామాన్య కార్యకర్తలు కూడా రూ.వేలల్లో పందేలు కాసి నష్టపోయారు. చాలామంది అప్పు చేసి మరీ బెట్టింగులు వేశారు. అలాంటి వారంతా లబోదిబోమంటున్నారు. ఈ పరిణామం వైసిపి శ్రేణులను మరింత కుంగదీస్తోంది.

ఏలూరు జిల్లాలో కూటమి, వైసిపి అభ్యర్థులకు వచ్చిన ఓట్ల శాతం

నియోజకవర్గం	కూటమి ఓట్లు	వైసిపి ఓట్లు
ఏలూరు	67	29.57
దెందులూరు	55.11	41.62
చింతలపూడి	53.3	40.93
నూజివీడు	51.12	45.27
ఉంగుటూరు	59.63	35.02
పోలవరం	46.33	42.07
కైకలూరు	60.38	35.36

ఎన్నికలకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు

జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ప్రశాంతంగా, విజయవంతంగా ఎన్నికలు ముగింపునకు సహకరించిన ప్రతి ఒక్కరికీ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ సజావుగా ముగిశాయన్నారు. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్, ఇవిఎంల ద్వారా పోలైన ఓట్లను భీమవరంలో ఏర్పాటుచేసిన రెండు కౌంటింగ్ కేంద్రాల్లో అన్ని రకాల భద్రతా చర్యల నడుమ ఎన్నికల పరిశీలకులు, ఆర్‌ఒలు, రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు పూర్తి చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా సాగిందన్నారు. కౌంటింగ్ ఫలితాల సమాచారం కూడా ఎప్పటికప్పుడు వెల్లడించినట్లు తెలిపారు. సాధారణ ఎన్నికల ప్రక్రియకు సహకరించిన జిల్లా ప్రజలకు, ఓటర్లకు, జిల్లా రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, జిల్లా అధికారులు, నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఎఆర్‌ఒలు, సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, పోలీస్ అధికారులు, కేంద్ర బలగాలు, జిల్లా ఎస్‌పికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహణకు సహకరించిన అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు, రాజకీయ పార్టీలు, సంస్థలు, మీడియాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టర్, ఉండి ఆర్‌ఒ సివి.ప్రవీణ్ ఆదిత్య, డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావు, ఎపి టూరిజం జెడి, ఆచంట ఆర్‌ఒ వి.స్వామినాయుడు తెలిపారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస నాయకులు

సమగ్రంగా ఉపాధి హామీ అమలుకు..

కొత్త ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తాడేల్లిగూడెం రూరల్

ఉపాధి హామీ చట్టాన్ని సమగ్రంగా అమలు చేయడానికి కేంద్రం, రాష్ట్రంలో ఏర్పడే కొత్త ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. పెంటపాడు మండలంలోని యానాలపల్లి, పడమర విప్పర్రు గ్రామాల్లో బుధవారం రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పర్యటించి ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్లో రూ.రెండు లక్షల కోట్లు కేటాయించాలని, ఉపాధి కూలీ రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని ప్రకడ్బందీగా అమలు చేయడం కోసం కూలీలంతా ఐక్యంగా పోరాడాల్సి ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు మరపట్ల చిన్నదానయ్య, గ్రామ కమిటీ సభ్యులు అద్దంకి బాబూరావు, తాడి మాధవయ్య, గాది అన్నవరం, కొమ్ము సోమయ్య, సంకర రాముడు, అద్దంకి భవాని, అద్దంకి లక్ష్మీ, రొక్కాల శాంత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

నియోజకవర్గ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్య నారాయణ అన్నారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రచారం వాడిన రాజకీయంతో ప్రజలు విసిగిపోయారని, దీంతో కూటమి అభ్యర్థులు 164 సీట్లు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా ప్రజల తీర్పుతో వైసిపికి తగిన గుణపాఠం చెప్పారన్నారు. కేవలం సింగల్ డిజిట్‌తో వైసిపి ఫ్యాన్ రెక్కలు విరిగిపోయాయన్నారు. దుర్మార్గమైన పరిపాలన, కక్షపూరితమైన అవినీతి రాజకీయంపై ప్రజలు తిరుగుబాటు చేశారన్నారు. ఇక్కడ మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు రోజుకో అబద్ధం ఆడుతూ అవినీతి చక్రవర్తిగా రైతుల డబ్బులు దోచుకోవడంతో రైతులు తిరస్కరించారన్నారు. ఎంఎల్‌ఎగా తాను నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను అమలు చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఎంఎల్‌ఎగా తనను గెలిపించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయి

ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

టిడిపి కూటమి విజయంతో రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరుగుతుందని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘు రామకృష్ణంరాజు పేర్కొన్నారు. ఆయన ప్రజాశక్తితో టిడిపి కూటమి గెలుపు ఆనందాన్ని పంచుకున్నారు. చంద్ర బాబు కష్టం, పవన్‌కళ్యాణ్ త్యాగంతో కలగలిపిన విజయమన్నారు. ప్రజా తీర్పుతోనే టిడిపి కూటమి అత్యధిక స్థానాలు కైవసం చేసుకుందన్నారు. మరోసారి దేశ రాజకీయాల్లో చంద్రబాబు చక్రం తిప్పే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రజలందరికీ ప్రగతితోపాటు సాధికారత రావాలి, అభివృద్ధి, సంక్షేమం అందరికీ అందాలని తెలిపారు. రాబోయే రోజుల్లో అమరావతి, పోలవరం పనులు జరగాలని ఆకాంక్షించారు. ఎంపీగా పోటీ చేయకుండా ఎంఎల్‌ఎగా చేశానని, ఉండి నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుస్థాయిలో 56,777 ఓట్ల మెజార్టీ సాధించడం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

చింతలపూడి ఎత్తిపోతల ప్రారంభమే ధ్యేయం

నూజివీడు ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు

చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేసి నా హయాంలోనే ప్రారంభోత్సవం చేయడమే తన లక్ష్యమని నూజివీడు ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారథి అన్నారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. తనను గెలిపించిన నూజివీడు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నూజివీడు పట్టణం, నూజివీడు రూరల్, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల్లో అన్ని గ్రామాలను అభివృద్ధి బాటలోకి తీసుకెళ్తానన్నారు. చంద్రబాబుతో మాట్లాడి వ్యవసాయ రంగంతోపాటు పారిశ్రామిక రంగం అభివృద్ధి, సాగు, తాగునీరుకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా కృషి చేస్తానన్నారు. కూతవేటు దూరంలో ఉన్న పారిశ్రామిక మల్లవల్లి ఏవిధంగా అభివృద్ధి చెందిందో అదేవిధంగా నూజివీడు ప్రాంతాన్ని కూడా పారిశ్రామికంగా అభివృద్ధి చేసేలా చర్యలు చేపడతానన్నారు. రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరుస్తానని తెలిపారు. విద్యా వ్యవస్థ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారికి అండగా ఉంటానన్నారు.

గెలిచిన ఎంఎల్‌ఎలతో పవన్‌కళ్యాణ్

పవన్‌ను కలిసిన ఎంఎల్‌ఎలు

ప్రజాశక్తి - నరసాపురం

మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌ను, పిఎసి సభ్యులు కొణిదెల నాగబాబును ఉమ్మడిపశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన జనసేన ఎంఎల్‌ఎలు కలిశారు. మంగళవారం ఎన్నికల్లో గెలిచిన వారిని పవన్ కళ్యాణ్, నాగబాబు అభినందించారు. జిల్లాకు చెందిన నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి అంజిబాబు, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు, పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు ఉన్నారు.

ఉంగుటూరు :ఉంగుటూరు ఎంఎల్‌ఎగా గెలుపొందిన పత్సమట్ల ధర్మరాజు బుధవారం మంగళగిరిలో జనసేన కార్యాలయంలో పవన్‌కల్యాణ్, నాగబాబు, నాదెండ్ల మనోహర్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. ఓట్ల లెక్కింపు, మండలాల వారీగా వచ్చిన మెజార్టీ వివరాలు, కార్యకర్తలు, కూటమి కష్టపడిన తీరును చర్చించినట్లు తెలిసింది.

నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటా

నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

నియోజకవర్గ ప్రజలకు ఐదేళ్లు అండగా ఉండి, అభివృద్ధికి కృషి చేస్తానని నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కూటమి నేతలతో కలిసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. తన గెలుపునకు రాత్రీ పగలు కృషి చేసిన కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గెలిపించిన నరసాపురం నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని చెప్పారు. ఎన్నికల్లో భారీ మెజార్టీ అందించిన నియోజకవర్గ ప్రజలకు తన జీవితాన్ని అంకితం చేస్తానని, ప్రతి నిమిషమూ ప్రజల కోసం గడుపుతానని చెప్పారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో, చంద్రబాబు ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తానని చెప్పారు.

అభివృద్ధికే ప్రాధాన్యత

కైకలూరు ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్

ప్రజాశక్తి - కైకలూరు

నియోజకవర్గ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తానని ఎంఎల్‌ఎగా గెలుపొందిన కామినేని శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ గతంలో వైసిపి ఎంఎల్‌ఎ నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులతో కలిసి కొందరు అధికారులు ప్రజలను వేధించారని, వారిపై తప్పక చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అసాంఘిక కార్యకలాపాలతో అరాచకాలకు పాల్పడిన వారిని గుర్తించి జిల్లా బహిష్కరణ చేస్తానని తెలిపారు. కొల్లేరు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యకర్తలు సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల వరకే రాజకీయాలని, అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు.

చంద్రబాబును కలిసిన ఎంఎల్‌ఎలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంఎల్‌ఎలు, నేతలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విజయం సాధించిన ఎంఎల్‌ఎలు టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడును బుధవారం కలిశారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, ఇతర నాయకులు చంద్రబాబు నాయుడుకు, లోకేష్‌కు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు, గన్ని వీరాంజనేయులు, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ, పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి, గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు, నూజివీడు ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారథి, తాడేపల్లిగూడెం టిడిపి ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు చంద్రబాబును కలిసినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాలో ఏకపక్షంగా అఖండ మెజార్టీని అందజేసిన ప్రజలకు, టిడిపి, బిజెపి, జనసేన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. గెలిచిన వారంతా విభేదాలు, వివాదాలకు తావు లేకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్‌డిఎ కుటమి ప్రభుత్వంతో సమన్వయంగా పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు.

పాలకొల్లు :ఉండవల్లిలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును కలుసుకునేందుకు వెళ్తున్న హిందూపురం ఎంఎల్‌ఎ నందమూరి బాలకృష్ణతో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు భేటీ అయ్యారు. పాలకొల్లులో భారీ మెజార్టీ సాధించిన నిమ్మల రామానాయుడును బాలకృష్ణ అభినందించారు. అలాగే పలువురు మాజీ మంత్రులు, కొత్త ఎంఎల్‌ఎలను నిమ్మల కలుసుకున్నారు. నిమ్మలతో పాటు ఉండి మాజీ ఎంఎల్‌ఎ మంతెన రామరాజు ఉన్నారు.

నరసాపురం:రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా పదవి చేపట్టనున్న చంద్రబాబు నాయుడుకు మాజీ శాసనసభ్యులు బండారు మాధవనాయుడు అభినందనలు తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం మంగళవారం రాత్రి మంగళగిరిలోని చంద్రబాబు నివాసంలో బండారు మాధవనాయుడు చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతా

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు జిల్లా సంపూర్ణ అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా ప్రతి నియోజకవర్గంలో ఒక పరిశ్రమ ఏర్పాటు లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు. పోలవరం, ఉంగుటూరు, నూజివీడు నియోజకవర్గాల్లో ఫ్యాక్టరీల స్థాపనకు ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు చింతలపూడి, నూజివీడు ఎంఎల్‌ఎతో కలిసి పని చేస్తానన్నారు. జిల్లాలో ముఖ్యంగా మహిళలు, నిరుద్యోగులు, యువత తనను ఎక్కువగా ఆదరించారని, అందరికీ మేలు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తాను ఎంపీగా బరిలోకి దిగినప్పుడు జిల్లాను ఏవిధంగా అభివృద్ధి చేస్తానని చెప్పానో అంతకుమించి అభివృద్ధి చేస్తానన్నారు. ఏలూరులో వందేభారత్ స్టాప్ కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఎంపీగా తనను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

'పోలవరం' అభివృద్ధికి కృషి చేస్తా

ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - టి.నరసాపురం

పోలవరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అన్నారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. పోలవరంలోని ఏడు మండలాల ప్రజలు తనపై నమ్మకం ఉంచి గెలిపించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, టిడిపి అధినేత చంద్రబాబు, ప్రధాని మోడీ సహకారంతో పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి చేయకుండా వదిలేసిన రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా చూస్తానని తెలిపారు. ఎన్‌డిఎ కూటమి గెలుపునకు సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో ప్రతిఒక్కరికీ అందుబాటులో ఉంటానని చెప్పారు.

పలుచోట్ల ఈదురుగాలులు, భారీ వర్షం

ప్రజాశక్తి - పశ్చిమ విలేకరులు

జిల్లాలో బుధవారం సాయంత్రం నుంచి ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. పెనుమంట్ర, భీమవరం, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. గాలులకు పలుచోట్ల చెట్లు పడిపోవడంతోపాటు విద్యుత్ స్తంభాలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రెండురోజులుగా ఉక్కబోత పెరిగిన నేపథ్యంలో కురిసిన భారీ వర్షంతో జనం సేదతీరారు.

ఆచంటలో నోటాకు నాల్గో స్థానం

పెనుమంట్ర: మంగళవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఆచంట అసెంబ్లీ స్థానంలో వచ్చిన ఓట్లలో నోటా నాల్గవ స్థానంలో నిలిచింది. ఇక్కడ మొత్తం పోలైన ఓట్లు 1,49,048 కాగా విజయం సాధించిన టిడిపి కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణకు 85,402 ఓట్లు వచ్చాయి. సమీప వైసిపి అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు 58,848 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి నెక్కంటి వెంకట సత్యనారాయణ(సతీష్) 1,872 ఓట్లతో మూడో స్థానం, బిఎస్‌పి అభ్యర్థి ఆలూరి చిన్నారావు 1543 ఓట్లతో 5వ స్థానంలో ఉండగా నోటా మాత్రం 1673 ఓట్లతో 4వ స్థానంలో ఉండడం విశేషం. పోటీలో ఉన్న మిగిలిన ఐదుగురు అభ్యర్థులకు కలిపి పడిన ఓట్లు 1207 ఓట్లు మాత్రమే, కాగా ఆచంటలో నోటా ఓట్ల శాతం పెరగడం పట్ల అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు.

రాష్ట్రానికి మంచి రోజులొచ్చాయ్

డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి

నరసాపురం: ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు, పవన్ రూపంలో మంచి రోజులు వచ్చాయని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, పశ్చిమగోదావరి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. కూటమి విజయదుందుభి మోగించిన సందర్భంగా నరసాపురం బస్టాండ్ వద్ద చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్ర పటాలకు ఆమె పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ ఎన్నికల సమరంలో జగన్‌ని ఇంటికి పంపించి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలు గెలిచారని ఆమె కొనియాడారు. ఇంతటి సునామీని సృష్టించి ఒక అసాధారణ విజయానికి నాంది పలికిన రాష్ట్ర ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అందరికీ స్వీట్స్ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో వనితా క్లబ్ ప్రెసిడెంట్ పుష్పా ఉమామహేశ్వరి, కార్యదర్శి బండి సర్లలత పాల్గొన్నారు.

రఘురామకృష్ణంరాజు గెలుపుపై హర్షం

కాళ్ల: ఉండి నియోజకవర్గ ఎంఎల్‌ఎగా కనుమూరు రఘురామకృష్ణంరాజు 56,777 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రఘురామకృష్ణంరాజు అమ్మమ్మ ఊరు జువ్వలపాలెం కావడంతో గ్రామస్తులు ఆయన గెలుపు పట్ల హర్షం వ్యక్తం చేశారు. రఘురామకృష్ణంరాజు ఎంఎల్‌ఎగా గెలవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. జువ్వలపాలెం గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గోకరాజు నాగరాజు, గోకరాజు శివబాబు, మాజీ ఎంపిటిసిలు నరసింహమూర్తి, విశ్వనాథరాజు, బొత్స గణేష్, టిడిపి నాయకులు సత్యనారాయణ, నరసింహమూర్తి, కిషోర్ రాజు హర్షం వ్యక్తం చేశారు.

ఐద్వా నేత సత్యవతికి ఘన నివాళి

ఆకివీడు: ప్రజా ఉద్యమాలలో నిరంతరం ప్రజల హృదయాల్లో నిలిచిన వారికి మరణం లేదని, అటువంటి మరణం లేని నాయకురాలే ఐద్వా నాయకురాలు బొల్లా సత్యవతి ఒకరని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు సంధర ఉదయ కుమారి అన్నారు. ఐద్వా నాయకురాలు దోకల లక్ష్మి అధ్యక్షతన జవహర్ పేటలో బుధవారం సాయంత్రం బొల్లా సత్యవతి వర్ధంతి సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా పార్టీ నాయకులు సత్యవతి చిత్ర పటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం జరిగిన సభలో ఉదయ కుమారి మాట్లాడుతూ సత్యవతి అనేక మహిళా సమస్యలపై పట్టు వదలని పోరాటం జరిపారని అన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని నేటి మహిళలు పోరాట స్ఫూర్తితో పయనించాలని ఉదయ కుమారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కె.తవిటి నాయుడు, పెంకి అప్పారావు, షేక్ వలి, గేదెల విజయ లావణ్య, గోపిశెట్టి రాణి, ఎస్‌కె.అమ్మాజీ, విజయలక్ష్మి, రాంబాబు, రవితేజ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉదయ కుమారి

ఆదిత్య విద్యార్థుల ఘనత

తాడేపల్లిగూడెం: 2023-24 సంవత్సరమునకు గాను స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన 346 మంది విద్యార్థులు వివిధ బహుళ జాతి కంపెనీలో ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపల్ పి.లక్ష్మీ సరోజ అన్నారు. ఇందులో అతి ఎక్కువ ప్యాకేజ్ రూ.8.8 కాగా యావరేజ్ ప్యాకేజీగా రూ.3.5 లక్షలుగా ఉండటం విశేషమన్నారు. ఒక్కో విద్యార్థికి ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు ఎంచుకొనే అవకాశం ఉంటుందని, ఆదిత్య యాజమాన్యం, ప్లేస్మెంట్ డివిజన్ ప్రణాళిక ద్వారా సాధ్యపడిందని ఆమె తెలిపారు. దీంతోపాటు ఐసెట్‌లో టాప్‌గా 1000లో 95 ర్యాంకులు సాధించారని, ఇది కేవలం స్థిరమైన ప్రణాళికతోనే సాధ్యం అని స్థానిక డైరెక్టర్ కె.శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ సుగుణ రెడ్డి అభినందించారు. ఆదిత్య అంటేనే ఉద్యోగాలు, లక్షల జీతాలు అని మరోసారి రుజువైందని తెలిపారు.

టిడిపి అభిమానుల సంబరాలు

మొగల్తూరు: మండలంలోని గ్రామాలలో పలువురు టిడిపి, జనసేన కూటమి అభ్యర్థుల విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేశారు. రాజకీయ నాయకులే కాకుండా సామాన్యులు కూడా ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల మహిళలు మిఠాయిలు పంపిణీ చేశారు. పులపర్తి వారి తోటలో పలువురు గృహిణులు ఆలయంలో పూజలు నిర్వహించి, మిఠాయిలు పంపిణీ చేశారు.

ఘనంగా సార్వా విత్తన దినోత్సవం

పెనుమంట్ర: సార్వా(ఖరీఫ్)కు అనువుగా ఉండే విత్తనాలు సాగులో నిలిపి ఉంచడం ద్వారా అధిక దిగుబడి పొందాలని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్.డాక్టర్ ధన్యరాజు శ్రీనివాస్ రైతులను కోరారు. బుధవారం స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో జరిగిన సార్వా విత్తన దినోత్సవ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు సార్వా సీజన్‌లో పడిపోని వరి విత్తనాలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించి, లబ్ధి పొందవచ్చన్నారు. అనువైన విత్తనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

బొలిశెట్టిని కలిసిన ఆసుపత్రి సూపరింటెండెంట్

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎగా ఘనవిజయం సాధించిన బొలిశెట్టి శ్రీనివాస్‌ను జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి, తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వడ్లాని సూర్యనారాయణ బుధవారం కలిశారు. స్థానిక గణేష్ నగర్‌లోని ఎంఎల్‌ఎ నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

శుభాకాంక్షలు తెలుపుతున్న సూర్యనారాయణ

జెడ్‌పిటిసిపై అట్రాసిటీ కేసు

వీరవాసరం: వీరవాసరం మండల జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడుపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు భీమవరం రూరల్ సిఐ వై.సత్యకిషోర్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే సమాచారంతో ఈనెల 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన తరువాత భీమవరం నియోజకవర్గ జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు విజయం సాధించడంతో ఆ రాత్రి గుండా జయప్రకాష్‌నాయుడు నల్లబ మండి పటాసులు కాల్పించారు. ఈ క్రమంలో పెదపేటలోని తన ఇంటి ముందు ఉన్న లింగంపల్లి సాల్మన్‌రాజు అనే యువకుడితో జయప్రకాష్‌నాయుడు, మరో ముగ్గురు కలిసి అతనిపై దాడి చేసి గాయపరిచారన్నారు. ఈ సంఘటనపై గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని, ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన ప్రజలంతా ఆ రాత్రి ఆందోళన చేశారని తెలిపారు. ఈ మేరకు బాధితుడు సాల్మన్‌రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జయప్రకాష్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సిఐ సత్యకిషోర్, ఎస్ఐ రమేష్‌లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు

ఆకివీడు: ఏలూరు జిల్లా సరిహద్దు ఉప్పుటేరు వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించాడు. మరొకరికి తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసుల కథనం ప్రకారం బుధవారం రాత్రి ఏలూరు నుంచి భీమవరం వెళుతున్న ఆర్‌టిసి బస్సును ఎదురుగా మోటార్ సైకిల్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు ఢీకొనడంతో సైకిల్ నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. మరొక వ్యక్తికి తీవ్ర గాయాలు అవ్వడంతో ఆసుపత్రిలో చేర్చారు. మృతుడు కలిదిండి మండలం సున్నంపూడి గ్రామానికి చెందిన చిప్పల నాగరాజు(23), గాయపడిన వ్యక్తి అదే గ్రామానికి చెందిన చింతా కృష్ణంరాజుగా గుర్తించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మారుతున్న విద్యా విధానాలకు దీటుగా..

అత్యున్నత విద్యాబోధన బిజిబిఎస్ మహిళా కళాశాల సొంతం



కళాశాల భవనం..

సెక్రటరీ, కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్

ప్రజాశక్తి - నరసాపురం

మారుతున్న విద్యా విధానాలకు దీటుగా మంచి అత్యున్నత విద్యను అందిస్తున్న కళాశాల బిజిబిఎస్ మహిళా కళాశాలని సెక్రటరీ, కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ అన్నారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఆడపిల్ల చదువుకుంటే మొత్తం కుటుంబం అంతా చదువుకున్న కుటుంబం అవుతుందని మహాత్మా గాంధీ అన్నారన్నారు. పద్మశ్రీ అద్దేపల్లి సర్వీచెట్టి 1967లో బిజిబిఎస్ మహిళా కళాశాలను స్థాపించారన్నారు. ఇది పశ్చిమగోదావరి జిల్లాలోని రెండో మహిళా కళాశాలన్నారు. అంకితభావంతో బోధించే ఉపాధ్యాయులు, చక్కటి తరగతులు, అత్యున్నత లేబోరేటరీ, యూనివర్సిటీ స్థాయిలోనే లైబ్రరీ, శరీర సౌష్టవం కోసం జిమ్ ఉన్నాయన్నారు. పిల్లల భవిష్యత్ కోసం ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసితో పాటుగా సంగీతం, నృత్యం, సర్వ లలిత కళలకు చక్కని వేదిక మహిళా కళాశాల అన్నారు. ఆడబిడ్డలు చక్కని చదువుతో పాటు సేద తీరడానికి చక్కటి ఆట మైదానం, పొరుగూరైతే మన పిల్లల భద్రంగా ఉండే హాస్టల్ బిజిబిఎస్‌కు మాత్రమే సొంతమన్నారు. సీసీ కెమెరా పర్యవేక్షణతో కళాశాల నిర్వహణ ఉందన్నారు. ఇంటర్మీడియట్ ఇన్‌ఛార్జిగా పూర్వపు ప్రిన్సిపల్ కె.అమ్మాజీ, మహిళా కళాశాల ప్రిన్సిపల్‌గా కె.మధుశాలిని వ్యవహరిస్తున్నారన్నారు. జూనియర్ ఇంటర్ సైన్స్ విభాగంలో ఎంపిసి, బైపిసి ఆర్ట్స్ విభాగంలో సిఇసి, హెచ్ఇసి ఒకేషనల్ విభాగంలో ఎంపిహెచ్‌డబ్ల్యు, ఎంఎల్‌టి కోర్సులను తెలుగు, ఇంగ్లీష్ మీడియం గ్రూపుల్లో అందిస్తున్నామన్నారు. డిగ్రీలో బిఎస్‌సి, బీకాం, బిఎ కోర్సు అందిస్తున్నామని తెలిపారు. ఎస్‌సి, బిసి, ఇబిసి విద్యార్థులకు స్కాలర్‌షిప్ నేరుగా వారి అకౌంట్‌లోనే జమవుతాయన్నారు. ఎస్‌సి, బిసి విద్యార్థులకు ఉచిత హాస్టల్ కలదన్నారు. తల్లిదండ్రులు ఒకసారి కాలేజీని సందర్శించి పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు మంచి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్యా కేంద్రం మా కాలేజీలో నడుస్తుందన్నారు. ఎటువంటి విద్యా అర్హత లేకుండా, ఇంటర్ పాసైన విద్యార్థులకు కోర్సులో అడ్మిషన్ పొందవచ్చు అన్నారు. కావున జాబ్ చేస్తూ చదువుకోవాలనే ఉద్దేశం గల స్త్రీలు, పురుషులు మా స్టడీ సెంటర్‌లో కోర్సుల్లో చేరవచ్చునన్నారు. తమ కాలేజీలో యుజి, బిఎ, బికాం, పీజీలో ఎంఎస్‌సి మ్యాథ్స్, ఎంఎ ఇంగ్లీష్, ఎంఎ తెలుగు, ఎంఎ ఎకనామిక్స్, ఎంఎ హిస్టరీ, ఎంఎ సోషల్ వర్క్, ఎంఎ సోషయాలజీ మరిన్ని వివరములకు 98853 81645 సంప్రదించగలరన్నారు. బిజిబిఎస్ మహిళా కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపిసిలో మోనిసా 420 మార్కులతో టౌన్ సెకండ్‌గా నిలిచిందన్నారు. ఎంపిహెడబ్ల్యూలో దీవెన 407, శ్రీసౌజన్య 404, సుజ్ఞాన 404 మార్కులు సాధించారన్నారు. జాయ్ ప్రిస్కిల్ల బైపిసిలో 388 మార్కులు సాధించింది. డిగ్రీలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. అడ్మిషన్లకు 7659838868 సంప్రదించగలరన్నారు.

కళాశాల ప్రత్యేకతలు

- విశాలమైన తరగతి గదులు
- క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన
- విశాలమైన క్రీడా ప్రాంగణం, మినరల్ వాటర్ ప్లాంట్
- అనుభవం కలిగిన క్వాలిఫైడ్ లెక్చరర్లతో విద్యాబోధన
- సంగీతం, డాన్స్, లలిత కలల్లో సాధన
- సాయంత్రం స్టడీ అవర్స్
- కెరీర్ గైడెన్స్ సెల్ ద్వారా డిగ్రీ స్టూడెంట్స్‌కి ఉచిత శిక్షణ
- చదువే కాదు ఆత్మ రక్షణ కోసం జిమ్, కరాటే

సృజనాత్మకత పెంపునకు శ్రీ చైతన్య పాఠశాల దోహదం

శ్రీ చైతన్య పాఠశాల..

శ్రీ చైతన్య జోన్ ఎజిఎం ఎస్.పార్థసారథి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు పాలకొల్లులోని శ్రీచైతన్య పాఠశాలను 2009లో 450 మంది విద్యార్థులతో టెక్నో కరిక్యులంతో ప్రారంభించామని శ్రీచైతన్య పశ్చిమ గోదావరి జోన్ ఎజిఎం ఎస్.పార్థసారథి తెలిపారు. నేడు మారుతున్న విద్యా విధానానికి తగ్గట్టుగా విద్యార్థులను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో మరో బ్రాంచిను పూలపల్లిలో 2017లో సి బ్యాచ్ కరిక్యులంతో ప్రారంభించామని, నేడు 1900 మంది విద్యార్థులతో దేదీప్యమానంగా విరాజిల్లుతుందని అన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఫలితాలలో తమ విద్యార్థులు 594 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్‌ను, 593 మార్కులు సాధించి టౌన్ సెకండ్‌ను కైవసం చేసుకున్నారని చెప్పడానికి గర్వపడుతున్నామన్నారు. నాడు టెక్నో కరిక్యులంతో ప్రారంభమై నేడు విద్యార్థులకు ఎఫ్2 ప్రోగ్రామ్, పిఎల్‌పి ప్రోగ్రామ్, ఎస్ఆర్‌పి ప్రోగ్రామ్, ల్యుసిడ హ్యాండ్ రైటింగ్, స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్, వేదిక్ మాథ్స్, ఇంగ్లీష్ ఎన్‌హెన్‌మెంట్ ప్రోగ్రామ్, రీజనింగ్, నాసా ప్రాజెక్ట్స్, అడాప్షన్ ప్రోగ్రామ్, ఇన్ఫినిటీ మేటా యాప్, సాఫ్ట్ స్కిల్స్, డిజిటల్ క్లాసులు, కంప్యూటర్ తరగతులు, ఒలింపియాడ్ పరీక్షలు, స్పోర్ట్స్ డే వంటి ప్రోగ్రాములు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రగతికి కృషి చేస్తున్నామని పాలకొల్లు రీజియన్ రీజనల్ ఇన్‌ఛార్జి బి.రాజ్ కుమార్ తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు 3డి ప్రోగ్రామ్, మెమరీ, మోటివేషన్ ప్రోగ్రామ్, స్టార్ ప్రోగ్రామ్, ఐడల్ బుక్స్, రివిజన్ ప్రోగ్రామ్, టార్గెట్ 600, గెస్ట్ టీచర్స్, ఫాస్ట్‌ట్రాక్ మెటీరియల్స్ మొదలైన కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని పాఠశాల ప్రిన్సిపల్ ఎ.అరుణ కుమారి అన్నారు. వీటితో పాటు శారీరక, మానసిక ధృఢత్వం కోసం ఆటలు, కరాటే, డాన్స్ వంటి వాటిలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

ప్రిన్సిపల్ ఎ.అరుణకుమారి

భారీ మెజార్టీతో బొలిశెట్టి విజయదుందుభి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం నియోజకవర్గం చరిత్రలోనే అత్యధిక మెజార్టీతో బొలిశెట్టి శ్రీనివాస్ విజయం సాధించారు. 1978లో కాంగ్రెస్‌లో వాలంటీర్‌గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1981-82లో యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. 1999 నుంచి 2004 వరకు కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్‌గా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం టిడిపిలో చేరారు. 2014 నుంచి 2019 వరకు మున్సిపల్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం 2019లో జనసేన నుంచి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా పోటీ చేసి 37 వేల ఓట్లు సాధించి ఓడిపోయారు. ప్రస్తుతం జనసేన తరుపున తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసి బొలిశెట్టి శ్రీనివాస్ ఘన విజయం సాధించారు. తన ప్రత్యర్థి, వైసిపి అభ్యర్థి కొట్టు సత్యనారాయణపై 61,510 ఓట్లు భారీ మెజారిటీతో బొలిశెట్టి విజయదుందుభి మోగించారు. తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలోనే ఇంతవరకూ ఎవరూ సాధించని అత్యధిక భారీ మెజార్టీని సాధించి జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ 61,510 ఓట్లు భారీ మెజార్టీతో ఆల్ టైం రికార్డ్ సృష్టించారు. గడిచిన ఐదు సంవత్సరాలు ఆయన ప్రజలతో మమేకమైతు, వారి కష్టసుఖాలలో తోడుగా ఉంటూ అనేక సహాయ కార్యక్రమాలను చేశారు. ముఖ్యంగా కరోనా టైంలో ప్రజలకు అనేక సహాయ సహకారములు అందించిన ఘనత బొలిశెట్టి శ్రీనివాస్‌ది దక్కుతుంది. అటు నాయకులకు, కార్యకర్తలకు తోడుగా ఉంటూ అధికార పార్టీ అవినీతిని ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేశారు. వైసిపి ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకత, అభివృద్ధికి నోచుకోని నియోజకవర్గం ఇవన్నీ బొలిశెట్టి విజయానికి కారణమయ్యాయి. పిలిస్తే పలికే వ్యక్తిగా బొలిశెట్టికి పేరు ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బొలిశెట్టి శ్రీనివాస్‌తో పాటు ఆయన తనయుడు బొలిశెట్టి రాజేష్ నియోజకవర్గం ప్రచారంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఓటింగ్ వివరాలు

15 రౌండ్లలో జరిగిన ఓట్ల లెక్కింపులో జనసేన బొలిశెట్టికి 1,14,955 ఓట్లు, వైసిపి కొట్టుకు 53,445 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మార్నీడి బాబ్జికి 1868 ఓట్లు, భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి పిఎస్ఆర్ కృష్ణకు 913 ఓట్లు, జై భారత్ అభ్యర్థి బూసనబోయిన ఆంజనేయులుకు 502 ఓట్లు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనువాసరావుకు 749 ఓట్లు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి మరపట్ల రాజుకు 739 ఓట్లు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి మేకా వెంకటేశ్వరరావుకు 201 ఓట్లు, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఉంగరాల పద్మకు 253 ఓట్లు, నడపన అచ్యుత కుమార్‌కు 157 ఓట్లు, బి.రాజేష్‌కు 263 ఓట్లు, లంకా ప్రసాద్‌కు 183 ఓట్లు, సిరివరపు సింహాచలానికి 238 ఓట్లు రాగా నోటాకు 1522 ఓట్లు పోలయ్యాయి.

సంక్షేమం ఒకటే చాలదని ప్రజలు భావించారు

కాంగ్రెస్ అభ్యర్థి నెక్కంటి వెంకట సత్యనారాయణ

ఆచంట: రాష్ట్రంలోని ప్రజలు సంక్షేమం ఒకటే చాలదని భావించడంతో వైసిపి ఘోర పరాజయాన్ని చవి చూడవలసి వచ్చిందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఆ పార్టీ అభ్యర్థి నెక్కంటి వెంకట సత్యనారాయణ(సతీష్) అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉండి ప్రజల ఆకాంక్షలు, మనోభావాలు పట్టించుకోకుండా ఏకపక్షంగా, నియంతృత్వం, అహంకార పరిపాలన సాగిస్తే ప్రజలు ఆదరించరని ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారని అన్నారు. ఈ ఎన్నికల్లో టిడిపి, వైసిపి రెండు పార్టీలు విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేసారన్నారు. ఎంత డబ్బు ఇచ్చినా కాంగ్రెస్‌కి ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేసి తమకు మూడో స్థానాన్ని అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తనకి సహకరించిన సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులకు, పార్టీ కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు, అభిమానులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఉపాధి అవకాశాలు లేకపోవడం, రహదారుల అభివృద్ధి స్థంభించిపోవడం, రుణభారం పెరిగిపోవడం, కార్మికుల జీవితాలు అతలాకుతలం కావడం వంటి కారణాలతో వైసిపి ప్రభుత్వంలో ప్రజా వ్యతిరేకత పెరిగిపోవడంతో ఓటమిపాలైందన్నారు. ప్రజలు సంక్షేమంతో పాటు అభివృద్ధి కావాలని కోరుకుంటున్నారని, దీంతో వైసిపిని పక్కన పెట్టి టిడిపి కూటమికి అధికారమిచ్చారన్నారు. నూతనంగా ఎన్‌డియే ప్రభుత్వం అధికారంలోకి రావడం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పరిమితంగా ఉండాలని, అదేవిధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు మోడీ, బిజెపిలకు దిమ్మతిరిగే తీర్పునిచ్చారని అన్నారు. 'ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో ముందుకొచ్చిన ఇండియా బ్లాక్ మంచి ఫలితాలను సాధించిందని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే వామపక్షాల బలం ఈసారి మెరుగుపడటం అభినందనీయమన్నారు. 2029లో కాంగ్రెస్ చేపట్టబోతుందని ఆయన స్పష్టం చేశారు.

ఘనంగా పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

ప్రజాశక్తి - నరసాపురం

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి కాలుష్యాన్ని దూరం చేయాలని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని శాస్త్రవేత్త రంగినీడి సుబ్బారావు అన్నారు. ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులలో భాగంగా బుధవారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రంగినీడి సుబ్బారావు పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మొక్కలను పెంచడం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, సలాది రామారావు, సుధీర్ మోహన్, సూర్యం బాబు, ప్రవీణ్, జీవన్ కుమార్ పాల్గొన్నారు.

నరసాపురం గ్రంథాలయంలో మొక్కలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం కోర్ట్ ప్రాంగణంలో జామ, దానిమ్మ, బత్తాయి మొక్కలను న్యాయమూర్తి ఆర్.వరలక్ష్మి నాటించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దానయ్య నాయుడు, పాల్గొన్నారు.

తణుకులో..

స్వర్ణాంధ్ర కళాశాలలో..

స్థానిక కళాశాల స్వర్ణాంధ్ర కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలిసి కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, కళాశాల ట్రెజరర్ కెవి.స్వామి, కళాశాల డైరెక్టర్ అడ్డాల శ్రీహరి మొక్కలు నాటారు. దాదాపుగా కళాశాలలో 1000 మొక్కలు నాటుతున్నామని కళాశాల ఛైర్మన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎ.గోపీచంద్ పాల్గొన్నారు.

వీరవాసరం: పర్యావరణ సమతుల్యం ద్వారానే స్థిరమైన ప్రకృతి నిలబడుతుందని జిల్లా సైన్స్ ఆఫీసర్ వివిఎం జడ్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి విద్యార్థులకు పెయింటింగ్, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మొగల్తూరు : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆరోగ్య వర్షిని వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి నాగిడి రాంబాబు అన్నారు. పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో బంధన విజయ్ కుమార్, కొల్లాటి పెంటయ్య ఉన్నారు.

పర్యావరణంను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సర్పంచి పడవలు మేరీ సత్యనారాయణ అన్నారు. మొగల్తూరులోని అమృత్ సరోవర్ చెరువు వద్ద మొక్కలు నాటారు.

తణుకు: ప్రతిఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని తాడేపల్లిగూడెం 11వ అదనపు జిల్లా జడ్జి, వెకేషన్ కోర్టు తణుకు ఎస్‌కె సికిందర్‌బాష అన్నారు. తణుకు కోర్టు భవనముల సముదాయము వద్ద న్యాయవాది జగలంక శివ స్పాన్సర్ చేసిన మొక్కలను కోర్టు ఆవరణలో నాటారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ కోర్టు జడ్జి చిరంజీవిరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరాం పాల్గొన్నారు.

ఉండి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని శిశుసమగ్ర అభివృద్ధి పథకం సూపర్వైజర్ పి.మేరీ అన్నారు. కాపులపేటలోని అంగన్వాడీకేంద్రం వద్ద నిర్వహించిన సమావేశంలో మేరీ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కను నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పిహెచ్‌ఎన్ హెప్సి కుమారి పాల్గొన్నారు.

పాలకోడేరు: పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఐసిడిఎస్ పీడీ సుజాత రాణి అన్నారు. వీసా కోడేరులోని ఐసిడిఎస్ భీమవరం ప్రాజెక్టు కార్యాలయం వద్ద బుధవారం పర్యావరణ దినోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. రాబోయే తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలంటే మొక్కలు పెంపకం ప్రతి ఒక్కరూ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ సిడిపిఒ లక్ష్మీకాంతం, సూపర్వైజర్స్ అనిల్ కుమారి పాల్గొన్నారు.

కాళ్ల: ప్రతి అంగన్వాడీ కార్యకర్తలు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని కాళ్ల సెక్టార్ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి అన్నారు. కాళ్లలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి అంగన్వాడీ సెంటర్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

కూటమి గెలుపుపై రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు హర్షం

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి నాయకులు చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరిలకు రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

నత్తారామేశ్వరంలో పితాని వెంకట్ దంపతులు

పెనుమంట్ర: టిడిపి కూటమి విజయం సాధించిన నేపథ్యంలో బుధవారం మండలంలోని నత్తారామేశ్వరం పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గం ప్రజల సంక్షేమం కోరుతూ రుద్రాభి షేకం, పల్లకి సేవలో పాల్గొన్నారు.

KANAKADURGA FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్: -1st ఫ్లోర్, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
- ఏలూరురోడ్డు, లక్ష్మీథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
-1st ఫ్లోర్, సుబ్బారావుపేట,కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
-1st ఫ్లోర్, వెంకట్రామ్‌ప్లాజా, కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డు, తణుకు.
-1st ఫ్లోర్, కన్యపురం రోడ్డు, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి పక్కన, కొయ్యలగూడెం.
-1st ఫ్లోర్, బస్టాండ్ ఎదురు, దేవరపల్లి
- గ్రౌండ్‌ఫ్లోర్,అక్షరానంద స్కూల్ ఎదురు, ధర్మాజీగూడెం-534462, ఏలూరు జిల్లా.
- 16-225, ఫస్ట్‌ఫ్లోర్, పాతబస్టాండ్ దగ్గర, జిబిమాల్ సూపర్ మార్కెట్, మెయిన్‌రోడ్డు, చింతలపూడి. ఫోన్ :9492934845, -DRNO :10-11-5/2 , 1 st Floor, Ganesh Chowk Center , Near Ravindra bharathi school, NIDADHAVOLU
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-06-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 1446.59 గ్రాముల వస్తువులు కుదువపెట్టిన పాత బంగారం నగలు #238-4-11, Subbammadevi High School Road, , Opp.Zed Labs, R.R.Peta, Eluru- 534 002. నందు వేలం వేయబడును. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయం పై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీస్
KANAKADURGA FINANCE LIMITED
#238-4-11,Subbammadevi High School Road, Opp.Zed Labs,R.R.Peta, Eluru-534 002.
Contact person, area manager, p.hemanth kumar-80746-56196

పాస్‌పోర్టు పోయినది
VALAVALA MURALI అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.05-06-2014న L9579535 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది.27-05-2024న మా ఇంటి నుండి మొగల్తూరు గ్రామం, మెయిన్‌రోడ్‌కు వెళ్తున్నపుడు నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.
VALAVALA MURALI
S/o. Valavala Dharma Rao
D.No. 1-58, Near Kanaka Durga Temple
Linganaboinacherla, Narasapuram (M)-534275 Dt., A.P.

CHANGE OF NAME
I, MEENAMBAKAM RAMACHANDRA RAO, S/o. Meenambakam Jayaram (late), Residing at 3C-17-10/1, Padamara Veedhi, Beside Kacheri Chavidi, Kotta Ganganamma Gudi Backside, Eluru, West Godavari District, (I Changing my Name from MEENAMBAKAM RAMCHANDRA RAO (Old Name) to MEENAMBAKAM RAMA CHANDRA RAO (New Name). Henceforth Iam being called as MEENAMBAKAM RAMACHANDRA RAO (New Name) for all purposes.

గౌరవ కుటుంబ న్యాయస్థానం, (Family Court) ఖమ్మం
O.P No. 73 /2023
Between:
డా॥ సట్టు సరేష్ ..... వాది
మరియు
సట్టు @ కాటూరి మేరీ రత్నకుమారి ..... ప్రతివాది
To,
సట్టు @ కాటూరి మేరీ రత్నకుమారి, భర్త: సట్టు సరేష్, తండ్రి: లేటు కాటూరి సుబ్బారావు, వయస్సు: 36, ప్రస్తుత వృత్తి, నివాసం: ఇంటి నెంబర్: 15-177, NTR కాలనీ, తాడేపల్లి గ్రామం, కామవరపు కోట మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
పై సూచించిన కేసునందు మీరు ప్రతివాదిగా ఉన్నారు. ఇట్టి కేసులో మీకు పలుమార్లు నోటీసులు పంపినప్పటికీ మీరు ఉద్దేశ్య పూర్వకంగా కోర్టుకు హాజరుకానందున గౌరవ కోర్ట్ వారి అనుమతితో ఈ ప్రకటన ఇవ్వడమైనది. ఇట్టి కేసు తదుపరి విచారణ ది. 24.06.2024న పైన తెలిపిన కోర్ట్ నందు కలదు. కావున మీరు ది. 24.06.2024 న ఉదయం 10.30 నిమిషములకు మీరు స్వయంగా కానీ, మీ న్యాయవాది ద్వారా కానీ హాజరై మీ అభ్యంతరములు తెలియజేయగలరు లేనియెడల కేసు మీ పరోక్షంలో నిర్ణయించబడును
(కోర్ట్ వారి అనుమతితో)
ఇట్లు,
ఏడునూతల శ్రీనివాసరావు,
ఏడునూతల అనురాధ,
న్యాయవాదులు, ఖమ్మం పట్టణం,
సెల్ నంబర్ .9849039167

మహారాజశ్రీ ఆళ్లగడ్డ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో
C.C. No. 870/2022
M. గౌరీ మనోహర్,
S/o. M.చంద్రయ్య,
వయస్సు 33 సం॥, హిందూ, బిజినెస్,
R/o.పాత కందుకూరు గ్రామం,
ఆళ్లగడ్డ మండలం, నంద్యాల జిల్లా. ...Complainant
V/S
రాఫాక రవికుమారు,
S/o. రాజారావు,
వయస్సు 40 సం॥, హిందూ, బిజినెస్,
R/o H. No.1-146, శ్రీరామ్ నగర్,
మల్లిపూడి (గ్రామం),
పెనుమంట్ర మండలం,
పశ్చిమగోదావరి జిల్లా. ...Accused
ముద్దాయికి సీఆర్‌పీసీ 82 సెక్షన్ నోటీసు
ఫిర్యాది, ముద్దాయి అయిన నీపై చెక్ బౌన్స్ కేసు దాఖలు చేసి ఉన్నందున సదరు కేసులో నీ పై అరెస్ట్ వారెంట్ వచ్చినది. సదరు అరెస్ట్ వారెంట్ అమలు కాకుండా నీవు కానరాక తప్పించుకుంటూ ఉన్నందున నీ యొక్క హాజరు నిమిత్తం 10-06-2024 వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో మీరు స్వయంగా హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల కోర్టు వారు నీ పై తదుపరి చర్య తీసుకోబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా : 10-06-2024
కె.వి.సుబ్బశర్మ,
కె.ఆనంద్,
ఫిర్యాది తరపు అడ్వకేట్స్,
ఆళ్లగడ్డ.
సెల్ నెం. 9440848108